# ఒక్క మనిషి కోసం ఎంత దూరమైనా రాగలడు

జి. మాధవరావు*

**బా**లగోపాల్ ఓరోజు ఫోన్ చేసి బోకర్ పోదాం రెడీగా ఉండమన్నాడు. బోకర్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఒక తాలూకా కేంద్రం. (మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్ నియోజకవర్గం కూడా అదే.) బోకర్ ఎందుకూ అని అడిగా. ఆదిలాబాద్ జిల్లా మామడ పోలీసుస్టేషన్లో ఒక లాకప్ మరణం జరిగిందనీ, మృతుడిది బోకర్ అని తెలిసిందనీ అన్నాడు. పైగా ఏదో ఎన్‌కౌంటర్ విషయమై అక్కడికి పోతే ఈ లాకప్ మరణం గురించి తెలిసిందన్నాడు. తను వచ్చేలోపు మరిన్ని వివరాలు సేకరిద్దామనే ఉద్దేశంతో మృతుడి వివరాలేమైనా ఉంటే ఇవ్వమన్నాను. మృతుడు బోకర్‌వాడు, అంతే అన్నాడు. మన భాష మాట్లాడని ప్రాంతంలో, మన రాష్ట్రంలో భాగంకాని ప్రాంతంలో సత్యాన్వేషణకు పోవాలి. పైగా మృతుడి గురించి ఏమీ తెలీదు... కనీసం పేరు కూడా. చూద్దాం సత్యాన్వేషణ ఎలా చేస్తాడో.

రాత్రి పొద్దుపోయాక వచ్చాడు. మా ఇద్దరికీ మరాఠీ రాదు. బోధన్‌నుంచి సంగంను పిలుస్తానన్నాను. సంగం అక్కడ లాయరు. ఎపిసిఎల్‌సి జిల్లా కార్యదర్శి. పొద్దున్నే బయలుదేరి బోకర్ వెళ్లాం. పది పదిహేనుమందిని అడిగాం. తెలీదు అనే జవాబే. ఎవరన్నా విలేకరి దొరికితే బాగుండునన్నాడు. విలేకరి గురించి వాకబు చేయగా ఎవరో అటుపొమ్మని చెయ్యి చూపించారు. 'సామ్నా' అన్న బోర్డు. దానికింద ఇంకేమో రాసిఉంది గాని మాకు రాదు! సంగం చదివాడు 'అన్నా విలేకరి' అన్నాడు. తలుపుకొడితే బయటికి వచ్చిన వ్యక్తిని పరిచయం చేసుకున్నాం. మామడ పోలీసుస్టేషన్ లాకప్ మృతుడి గురించి అడిగాం. రెండునెలలు అయిపోయిందిగదా

* మానవహక్కుల వేదిక నిజామాబాద్ జిల్లా కన్వీనర్

అన్నాడు. అయితే ఇతగాడికి తెలుసన్నమాట అనుకుని వివరాలు చెప్పమన్నాం. అతని భార్యవచ్చి ఇప్పుడు బోకర్‌లో లేరనీ ఆంధ్రాలోనే ఉన్నారనీ చెప్పింది. అతని వృత్తి ఏంటో అడగమన్నాడు బాలగోపాల్. గిసాడీ అని జవాబు. ఊరిపేరు తెలీదుగానీ లోహెస్రా (ప్రస్తుతం – లోకేశ్వరం) పోయే రోడ్డుకు అభిముఖంగా ఉండే రోడ్డులో చివరి ఊరు అన్నాడు. పీచేముడ్.

'ఎట్లా బాలగోపాల్' అంటే పదండి పోదాం అన్నాడు. లోహెస్రా అడ్డరోడ్డు వరకూ బస్సు, అక్కడినుండి లారీ. బాలగోపాల్‌ను కేబిన్‌లో కూర్చోబెట్టి నేనూ, సంగమూ లారీ ఎక్కాం. దిగి వెతుక్కుంటూపోతే ఆమె ఆ ఊరు ఖాళీ చేసి వెళ్లిపోయిందనీ, ప్రస్తుతం 'తానూర్'లో ఉంటోందనీ చెప్పారు. గోటు తానూర్... సాయంత్రమైంది తానూర్ పోయేప్పటికి. మృతుడు గిసాడీ (కుమ్మరి) వృత్తి చేసేవాడని బోకర్‌లో 'సామ్నా' విలేకరి చెప్పాడుగదా. ఆ విషయం కనుక్కుందాం ముందు అన్నాడు. గిసాడీ ఒక వృత్తి... ఒక కులం కూడా. ఇనుప మూకుళ్లు, కడాయిలు తయారు చేస్తారు. నేరుగా ఆ కులం వాళ్ళు నివసించే గుడిసెల వద్దకు తీసుకుపోయారు.

మమ్మల్ని పరిచయం చేసుకోగానే బాలగోపాల్ కాళ్లమీద పడిపోయింది మృతుడి భార్య. పోలీసుల వేధింపులు భరించలేక బోకర్‌కు పోయామనీ, బోకర్‌లో బతుకుతున్నా పోలీసులు వదలకుండా తన భర్తను తీసుకుపోయి చంపేసారనీ చెప్పింది. ఎందుకు పట్టుకుపోయారంటే మూడు కిలోల ఇనుప ముక్కను తన మొగుడు కొన్నాడనీ, కొంటున్నది దొంగసరుకని తెలీదనీ చెప్పింది. ఆ ఇనుప ముక్కను ఇమ్మని పోలీసులు వేధించారు. ఆ ముక్క అప్పటికే కడాయి (చిన్న మూడుకు)గా మారిపోయి ఎప్పుడో అమ్ముడయిపోయింది. సమాచారం మొత్తం సేకరించగలిగాం. బాలగోపాల్ తేల్చిందేమిటి? మూడు కిలోల ఇనుపముక్క ఖరీదు ఓ కళాకారుడి, ఓ కార్మికుడి, ఓ కుటుంబ పోషకుడి ప్రాణం. ఇదేమి ఈక్వేషన్. ఇది మన రాష్ట్ర పోలీసుల గణితం. 'బాలగోపాల్ నువ్వుకాబట్టి ఈ పరిశోధన చేయగలిగావ్. మేమింతదూరం రాకపోయి ఉండేవాళ్లం' అన్నా మౌనమే... ఈ ఉక్కు సంకల్పమేగదా బాలగోపాల్‌ను విశిష్ట వ్యక్తిగా నిలబెట్టింది.

ఇదంతా ఒక ఎత్తైతే ఆ తర్వాతది మరింత ఆసక్తికరం. తానూర్‌నుంచి మళ్లీ నిజామాబాద్ రావాలి. తానూర్‌లో ఎక్కిన బస్సు భైంసాలో కాసేపు ఆగింది. బహుశా డ్రైవరూ కండక్టరూ చాయ్‌కోసం దిగారేమో. సంగం కూడా దిగాడు నేనూ బాలగోపాలూ బస్సులోనే కూర్చున్నాం. ఇంకా మందికూడా ఉన్నారు. హఠాత్తుగా బస్సు గేర్‌బాక్స్‌లోంచి మంటలు లేసాయి. బస్సంతా గందరగోళం. డోర్‌వైపు

తోసుకొచ్చేస్తున్నారు. నేను కిటికీలోంచి దూకేసా... 'బాలగోపాల్ దూకెయ్యి' అని అరుస్తూ. ఊహూ... అక్కడే కూర్చున్నాడు. రెండు మూడు నిమిషాల్లో మంటలు ఆగిపోయాయి. ఎటువైపూ విస్తరించకుండానే. దిగలేదేం బాలగోపాల్ అంటే 'పెట్రోలు టాంకుకు ఏమీ కాలేదుగా' అని జవాబు. ఇది మొండితనం కాదు. జగమొండితనం.

బాలగోపాల్‌తో ఒక్కో పర్యటనలో ఒక్కొక్క కొత్త విషయం నేర్చుకునేవాళ్ళం. ఒక్కో కొత్త కోణం తనలో కనపడేది. బాధితుల్ని ఎలా ఇంటర్వ్యూ చేయాలోననే దగ్గర్నుంచీ పత్రికా ప్రకటన వరకూ బాలగోపాల్‌ది ప్రత్యేక పద్ధతి. మూస పద్ధతి వద్దనేవాడు. వైవిధ్యం ఉండాలనేవాడు. బాలగోపాల్‌ది ప్రత్యేక శైలి అంటున్నానంటే అది ఆయన ఆలోచనలోని స్పష్టతకు ప్రతిబింబం అని. రిపోర్టు రాయడానికి ముందే అన్ని కోణాల నుంచీ ఆలోచించాలి అనేవాడు. అంటే మేధోమధనం ముందే జరగాలి. అందుకే కార్యకర్తల సమావేశాలకు ఎంతో ముందే ఎజెండా పంపేవాడు. చర్చ సులువయ్యేది. కాలహరణం జరిగేది కాదు.

బాలగోపాల్ చదవడంలోనూ చాలాస్పీడు. అంతే స్పీడుతో చదివిందాన్ని బుర్రలో భద్రపరిచేవాడు. ఒకసారి ఆర్మూర్ ప్రాంతంలో ఒక ఎన్‌కౌంటర్‌లో వాస్తవసేకరణకు వచ్చాడు. నాకు పని ఉండి లేటుగా వచ్చాను. నేను ఇంటికి వచ్చేసరికి వరండాలో తిరుగుతూ గ్రాంసీని తినేస్తున్నాడు. ఆర్మూర్‌కి మనం బస్సులో పోవడం లేదు... స్కూటర్ మీద పోదాం... ఈలోగా స్టేట్ అండ్ సివిల్ సొసైటీ గురించి నువ్వు చెప్పాలి అన్నా. దారి పొడవుగా గ్రాంసీ మాట్లాడిన మట్టి కోటలు, అగడ్తలు అంటే ఏమిటో మహాద్భుతంగా చెప్పాడు.

ఒకసారి హైదరాబాద్ ఎస్వీహాలులో ఏదో మీటింగు అయిపోయాక ఎదురుగా ఉన్న హొటల్లో ఇరానీ చాయ్ తాగుతూ కూర్చున్నాం. డి.డి. కోశాంబిని తెలుగువాళ్లకు పరిచయం చేసిందే బాలగోపాల్. కోశాంబి రాసిన వ్యాస సంపుటి 'ఎక్జాస్పరేటింగ్ ఎస్సేస్'లోవి కొన్నిటిని నేను తెలుగు చేసా. 'ఆచరణలో గతితర్కం' పేరుతో నిజామాబాద్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ మెమోరియల్ ట్రస్టు ప్రచురించింది. ఒక కాపీని 'బాలగోపాల్‌కి ప్రేమతో' అని రాసిచ్చా. 'అన్ని వ్యాసాలూ చేసావా' అన్నాడు. ఇంకా రెండు మిగిలాయి అన్నా. రెండో ఎడిషన్‌నాటికి వాటిని కూడా చెయ్యి అన్నాడు. ఆ అవకాశం ఇంకా రాలే. కానీ... కానీ... బాలగోపాల్ రాసిన ఇంగ్లీషు వ్యాసాలకు తర్జుమా చేసే అవసరం నాకు పడుతుందని ఎప్పుడూ నేను అనుకోలే... ఒకవేళ పడ్డా ఇంత తొందరగా ఆ అవసరం కల్పిస్తాడనుకోలే...